## 48. నోటి జాగ్రత్తలు

ఓ బ్రహ్మజ్ఞానిని ఓ రాజు తన అంతఃపురానికి ఆహ్వానించాడు.

"మీ పనులు నాకు వింతగా వుండి నవ్వు రావచ్చు. నేనలా నవ్వడం నీకు అభ్యంతరం లేకపోతే వస్తాను." ఒప్పుకున్నాడాయన.

ఆ ఒప్పందం మీద రాజు ఆ బ్రహ్మజ్ఞానిని తన అంతఃపురానికి తీసుకువచ్చాడు. మొదటి రోజు రాజుగారు బంగారు రేకులు కరిగిన అన్నం తింటూండటం చూసి బ్రహ్మజ్ఞాని వెటకారంగా ఫక్కున నవ్వాడు. ఎందుకలా నవ్వారని రాజు ప్రశ్నిస్తే ఆ బ్రహ్మజ్ఞాని ఏం జవాబు చెప్పలేదు.

మర్నాడు రాజు తప్పు చేసిన సేవకులని తిడుతూంటే చూసి ఆ బ్రహ్మజ్ఞాని మళ్ళీ ఫక్కున నవ్వాడు. ఎందుకు నవ్వారని రాజు అడిగితే ఆయన దానికీ జవాబివ్వలేదు. మూడో రోజు ఆయన వెళ్ళిపోయేప్పుడు రాజు బ్రహ్మజ్ఞానిని బ్రతిమాలుతూ అడిగాడు, ఆ రెండు సందర్భాల్లో ఎందుకు నవ్వారో చెప్పమని.

"నువ్వు ఖరీదైన భోజనం తినడం చూసి నోట్లోకి వెళ్ళినవి బయటకి రాక అక్కడే వుంటాయా అని నవ్వొచ్చింది. రెండోసారి నువ్వు నీ సేవకులని తిడుతూండటం చూసి, నోట్లోంచి బయటకి వెళ్ళినవి బయటే వుండవు, తిరిగి అవి వచ్చి నీకే చేరతాయని తెలియదా అని నవ్వొచ్చింది." వివరించాడా బ్రహ్మజ్ఞాని.

## 49. ఏది నీది?

ఒకతను తనకి వారసత్వంగా వచ్చిన పొలాన్ని తన మిత్రుడికి తీసుకెళ్ళి చూపిస్తూ చెప్పాడు.

"ఈ ఇరవై ఎకరాల భూమి నాది."

వెంటనే వాళ్ళకో పెద్ద నవ్వు వినిపించింది.